అంతర్వాహిని

హితశ్రీ

* గతసంచిక తరవాయి *

12

విశ్వం హైదరాబాద్ నించి తిరిగివచ్చాడు. బండి దిగగానే ఎదురుగా వొచ్చాడు గోపీ. తనకు చనువు ఉన్నవాళ్లు ఎవరొచ్చినా గోపీకి అలా ఎదురురావటం అలవాటు. విశ్వం అది చాలాసార్లు గమనించాడు. అయితే అలా ఎదురురావటమనేది అందరిపట్లా సర్వసామాన్యమే. తనూ తెలిసినవాళ్లొస్తే ఎదురువెడతాడు. కాని తనలాంటి పెదవాళ్ళు అలాచేయటంలో కుర్రవాడైన గోపీ అలాచేయటంలో తేడాఉంది. వరండాలో తీరికగా కూర్చుని కబురు చెప్పుకుంటున్నప్పుడు విశ్వం గోపీని అడిగాడు. "వాకిట్లో బండిఆగి చుటాలెవరైనా వొస్తున్నప్పుడు ఎదురువెళ్లటం దేనికిరా గోపీ, వాళ్లెలాగూ ఇంట్లోకి వస్తారుగా."

గోపీ ఈ ప్రశ్నకి తెల్లబోయాడు. ఏం సమాధానం చెప్పాలో వాడికి తెలియలేదు.

"ఊరికే" అన్నాడు.

"మర్యాదకోసమా?"

గోపీ థర్డ్ ఫారం చదువుతున్నా అది ఈడుకి మించిన చదువు. వాడికీ ప్రశ్నలోని భావం సరిగా అర్థంకాదని విశ్వానికీ తెలుసు. "ఉహుఁ" అన్నాడు గోపీ ప్రశ్న అర్థమైనట్టుగానే.

"వెళ్లాలనిపిస్తుందా?"

అవునన్నాడు గోపీ. ఎందుకనిపిస్తుందో వాడికి తెలియదు. వాడు ఆలోచించివెళ్లడు. కాళ్లు లాక్కుపోతాయి, అంతే.

విశ్వం ఆలోచించాడు. తనలా ఎదురువెడితే ముఖ్యంగా మర్యాదకోసం వెడతాడు. మనసు హెచ్చరిస్తుంది. పసివాడికి ఆ హెచ్చరిక ఏంలేదు. పరిచయస్థుణ్ణి చూడగానే హృదయగత బాంధవ్యం ఏదో అప్రయత్నంగా వాడిని అలా లాక్కుని వెడుతుంది.

ఇది పైకి చాలా చిన్నవిషయంగానే కనిపించినా ఇందులో గంభీరభావం ఏదో ఇమిడిఉన్నదనిపించింది విశ్వానికి. అన్నిసార్లు గోపీ తన బండిదగ్గిరికి పరిగెత్తుకుని వచ్చినా తనావిషయం గురించి ఈరోజు ఆలోచించినట్టు ఆలోచించలేదు పూర్వం ఎన్నడూ. ఈసారి గోపీ అలా రావటం చూడగానే తనకీ ఊహ ఎందుకు కలిగిందో!

కొంచెంసేపాగి విశ్వం అడిగాడు.

"గోపీ, నువ్వెరిగిన వాళ్ళందరిలో ఎక్కువ మంచివాడెవరు?"

"రంగారావు మాస్టరుగారు." తడుముకోకుండా చెప్పాడు వాడు.

"ఎందుకూ?"

గోపీ ఆలోచించాడు.

"ఏమో" అన్నాడు చివరికి.

రంగారావు మంచివాడే. అయితే గోపీమాస్టరలో అంత మంచివాళ్లు ఇంకా ఉన్నారు. కాని వాడికి రంగారావంటేనే అభిమానం ఎందుకో? ఆ విషయం వాడికే తెలియదు.

"అందరిలోకి ఎవరంటే నీకిష్టం?"

గోపీ కొంచెం ఆలోచించి అన్నాడు.

"అక్కయ్య."

"ఎందుకు?"

ఈసారి సమాధానం వాడికి తెలుసు. స్టేషన్‌కి వెళ్ళినప్పుడు రైలు కదులుతుంటే అక్కయ్య దూరమవుతుంటే వాడికి కన్నీళ్ళుతిరిగాయి, అక్కయ్యకీ తిరిగాయి. వాడికి అక్కయ్య కావాలనిపించింది. వాడి ఆలోచనలు ఆమెవేపు మరలాయి. జవాబివ్వటం మర్చిపోయాడు. విశ్వం అది గమనిస్తూనే ఉన్నాడు. వాడి మనసులో ఏముందో కూడా అతనికి తెలుసు.

విశ్వం ఆలోచనలోపడ్డాడు. కొన్ని విషయాలు

కేవలం తార్కికంగా ఆలోచిస్తే తేలేవికావు. ఆ అవసరం కూడా లేదేమో. హృదయంలోని ఏవో అనుభూతులు మన ప్రవర్తనకి కారణ మౌతాయి కొన్ని సమయాల్లో. అదిహేతుపూర్వకంగా ఉండక పోవచ్చు. సమర్థనీయం కూడా కాకపోవొచ్చు. కాని హృదయంలోని ఆ అవ్యక్తభావాలని కాదనటానికి వీల్లేదు.

డాక్టర్ ప్రవర్తనగురించి తను సందేహంగా చెప్పినప్పుడు ఆమెలో కలిగిన ధోరణి తనుమర్చిపోలేదు. ఆమెఆలోచించటం మానేసింది. హృదయం మూగగా ఏదో పలికింది. లేకపోతే ఆమె అలా ఆవేశంగా మాట్లాడలేదు. ఆక్షణంలో తన హృదయం స్పందించింది. అంతగా హృదయాన్ని ఊపి వేయగల సన్నివేశం తన జీవితంలో ఇంతవరకు జరగలేదు. పద్మ వ్యక్తిత్వం తనకిప్పు డర్థమవుతోంది. అంతగా తన వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోడంవల్లే డాక్టర్ మీద ఇతర్ల అభిప్రాయాల్ని తృణప్రాయంగా చూసి ఉదాత్తంగా వ్యవహరించ గలిగింది. పద్మలా ఎంత మంది ఉంటారు!

కాసేపు అలాగే ఆలోచిస్తూ కూర్చున్నాడు విశ్వం. ఆలోచనల్లో వసంత జ్ఞాపకం వచ్చింది. పదిహేను రోజులైనా అయివుంటుంది తనామెను చూసి. బయటికి వెళ్ళి కాస్త కాఫీతాగి అలా వసంత ఇంటికి వెళ్ళాలనుకున్నాడు విశ్వం. కాని ఇంతలో మనసు మార్చుకున్నాడు. రైల్లో నిద్రలేక కళ్ళు బరువుగా వున్నాయి. సాయంత్రం వెడితే కులాసాగా ఉంటుందనుకున్నాడు.

సాయంత్రం కాగానే ఆకాశంలో మబ్బులు అలుముకో సాగాయి. సన్న జల్లుకూడా ప్రారంభమయింది అయినా విశ్వం బయల్దేరివెళ్ళాడు. తలుపు తట్టబోయేసరికి అతనికి లోపలనించి ఏవోమాటలు వినిపించసాగాయి, ఆగాడు. మాటలు రానురాను స్పష్టంగా వినిపించసాగాయి. వసంత కంఠం తీవ్రంగా వినిపిస్తోంది. ఉన్నట్టుండి చెంప ఛెళ్ళుమన్న శబ్దం వినిపించింది. దడాలున తలుపు తోసుకుని లోపలికిఅడుగు పెట్టాడు విశ్వం. దండతాడిత భుజంగంలా ఉంది వసంత. పక్కన నటేశ్వరరావు కందగడ్డలాంటి వదనంతో నుంచున్నాడు. చప్పుడు విని ఇద్దరూ తలుపు వైపు చూశారు.

"ఏమైంది?" అన్నాడు విశ్వం యిద్దరివైపూ చూస్తూ.

నటేశ్వర్రావు ముఖం మరింత ఎరుపెక్కింది.

"చెయ్యి పట్టుకున్నాడు దుర్మార్గుడు," అంది వసంత రోషంతో.

"పతివ్రత, పాపం." అన్నాడు నటేశ్వర్రావు హేళనగా.

"షటప్" అన్నాడు విశ్వం వొళ్ళుమరిచి.

"విశ్వంగారూ, మర్యాద ఇచ్చి పుచ్చుకోండి. మీకు పరిస్థితులు తెలియవు. ఎంతడబ్బు తగలేశానో, భవానీ శంకరుడిలా."

"ఎవరికి?" అంది వసంత రెట్టిస్తూ.

"చెప్పాలా?"

"నేను మీ బహుమతీ ఒక్కటికూడా ముట్టుకోలేదు. ఎప్పటికప్పుడే తిరగ్గొట్టినా సిగ్గులేక..." వసంత పూర్తిచెయ్యలేదు.

"మీవాళ్ళకిస్తే ఒకటీ నీకిస్తే ఒకటీనా?"

"నాకు వాళ్ళతో సంబంధం లేదు."

వసంత కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఇదేనా మీ నాటక కళోపాసన?" విశ్వం నటేశ్వర్రావు వైపు అసహ్యంగా చూస్తూఅన్నాడు.

"మీ చిత్ర కళోపాసన సంగతేమిటో!"

విశ్వం నిరుత్తరుడయాడు ఒక్కక్షణం.

"గురువింద గింజ తన నలుపెరగదట!"

"నేనేం దౌర్జన్యాలు చెయ్యలేదు గెటౌట్" గట్టిగా అరిచాడు విశ్వం.

"తమరే దయచెయ్యండి" అన్నాడు నటేశ్వర్రావు వ్యంగ్యంగా.

విశ్వం చెయ్యి చేసుకోటానికి సిద్ధమయాడు.

"సిద్ధమే."

వసంత కలగచేసుకుంది.

"నటేశ్వర్రావుగారూ, మా ఇంట్లోనుంచి వెళ్ళిపొమ్మంటున్నాను. పెద్దమనిషితరహాగా ప్రవర్తించలేరా?"

ఏమనుకున్నాడోగాని నటేశ్వర్రావు "ఆల్ రైట్" అని వెళ్ళిపోయాడు.

"బి. ఎల్. ప్యాసయాడు. శేపోమాపో ప్రాక్టీస్ పెటబోతున్నాడు. ఏంబుద్ధులివి?" అన్నాడు విశ్వం జుగుప్సగా.

"మొదటినించి ఆయన ప్రవర్తన అటువంటిదేనండీ. నేను భయపడుతూనే ఉన్నాను ఇలాంటిదేదో జరుగుతుందని" గాద్గదికంగా అంది వసంత.

విశ్వం ఏమీ అనకుండా కుర్చీలో కూర్చున్నాడు. మేకపిల్లని తోడేలు తరుముతున్నట్టు అతనిమనోవీధిలో గోచరించింది. విశ్వం తలపట్టుకున్నాడు.

"అసలు బహుమతులు ఎందుకు తీసుకున్నావు?"

"నేను తీసుకోందే!"

"ఎవరికో ఇచ్చావంటున్నాడుగా."

"దానికి నేను బాధ్యురాల్నా?"

"మీవాళ్ళేటగా?"

"అయినా నాకు వాళ్ళతో ఏం సంబంధం లేదు. నేను వేరే వుంటున్నానని మీకు తెలుసుగా?"

"అయితేమాత్రం, చెప్పాలిసినబాధ్యత నీకు లేదూ? ఈ మాత్రం విషయంకూడా మరొకరు చెప్పాలా?"

కోపంగా అన్నాడు విశ్వం. వసంత కళ్లలో నీళ్ళు తిరిగాయి.

"తెలిసికూడా మీరలా మాట్లాడితే ఎలా?" అందామె గాద్గదికంగా.

విశ్వానికి జాలేసింది. ఆమెని కోపగించుకోటానికి తనెవరు? తనకేం హక్కుంది? అయినా ఆమె అలా తిరస్కరించకుండా తనకి సమాధానాలు చెబుతోంది. అన్నివైపుల్నించి అందరూ ఆమెని బాధపెడుతుంటే ఎలా తట్టుకుంటుంది?

"వసంతా!" అన్నాడు కారుణ్యం ఉట్టిపడే స్వరంతో. ఆమె కళెత్తి చూసింది.

"ఆదుకునేవాళ్ళు లేనివాళ్లని ఆదరించటం మాని వాళ్ళ నిస్సహాయస్థితి ఆధారంగా తీసుకుని స్వప్రయోజనాలు సాధించుకునేవాళ్ళ నేమనాలో తెలియటం లేదు."

"తోడేళ్ళు" ఆవేశం అణచుకోలేక అందివసంత.

సరిగా తన మనసులో ఉన్నదే ఆమె అంది. ఆమాటే అన్నాడు విశ్వం ఆమెతో. అలా ఇద్దరి మనసుల్లో ఒకేమాట తోచటం అదే మొదటిసారి అని ఇద్దరూ ఒకరికొకరు చెప్పుకున్నారు.

సన్నజలు చిలికి చిలికి గాలివానయింది. ఉరుములూ, మెరుపులూ, వానా, గాలితో ప్రకృతి భీభత్సంగా ఉంది.

"ఇక్కడ చిక్కుపడ్డానే" అన్నాడు విశ్వం.

"తొందరపని ఉందా?"

"ఏం లేదులే."

"మరయితే నష్టం ఏముంది? ఏమైనా చెప్పండి. వింటాను."

"అనగా అనగా ఒకరాజు - చెప్పాలా?"

"వేళాకోళం కాదండీ"

"బొమ్మ వేసుకుంటే బావుంటుంది. ఎన్నాళ్ళకీ అది పూర్తి కావటం లేదు."

"ఇప్పుడా?" అంది వసంత,

"ఏం? మోడల్ ఇవ్వటానికి ఓపిక లేదా?"

"మీకు కోపం వస్తుందేమోగాని, ఎన్నాళ్లండీ మోడల్ ఇచ్చేది?"

"నేను ముందరే చెప్పానుగా. బాగా వెయ్యాలంటె కొన్ని నెలలు తీసుకొంటుంది ప్రతిబొమ్మా"

"మీకు శ్రద్ధలేదు. హైదరాబాద్ వెళ్ళి ఇన్నిరోజులు చేశారుగదా. ఏ ఉద్యోగమో అయితే బొమ్మ పూర్తి చెయ్యకుండానే వొదిలి వెళిపోతారు"

"ఉద్యోగం వొచ్చేసూచన ఏమీ లేదు."

"ఎందుకు రాదు?"

"ఇన్ని దరఖాస్తులు పెట్టాను, ఒక్కరూ కనీసం ఇంటర్ వ్యూకయినా పిలవలేదు."

"అవుతుంది లెండి." అని భరోసా ఇచ్చిందామె.

విశ్వం పరికరాలు తీసుకున్నాడు. వసంత మోడల్ ఇస్తోంది.

బయట హోరు గాలి. కుంభవృష్టి.

కను ముక్కు తీరు సరిదిద్దుతున్నాడు విశ్వం. తళుక్కున మెరుపు మెరిసింది. కిటికీలోంచి ఆ కాంతి సరిగా వసంతమీద ప్రసరించింది.

"మెరుపు మెరిసి మీరు జారిపడారనుకున్నాను" అన్నాడు విశ్వం చిరునవ్వు నవ్వుతూ.

"మీరు కవిగారు కారుకదూ? బొమ్మ గీసుకోండి కవిత్వం జోలికపోకుండా" అంది వసంత.

పెదవులు కెంపురంగుతో చిత్రిస్తున్నాడు విశ్వం. రేఖలు సరిచూసుకోటానికి కొంచెం దగిరగా వచ్చి నిలబడమన్నాడు. ఆమె వెంటనే అలాగే చేసింది.

పెదవులరేఖలు చూడబోయి ఎఱుపుదనం చూస్తూ నుంచున్నాడు విశ్వం. సరిగా అదే ఎఱుపు ఎలా చేయటం? అది సాధ్యమయేలా లేదు. మెఱుపు మెరిసింది కళ్ళు మిఱుమిట్లు గొల్పాయి. ఆ మెఱుపులో మెరిసిపోయే వసంతసౌందర్యమంతా, ఆ తనూకాంతి ఉన్నదివున్నట్టుగా ఎలా చిత్రంలోకి తీసుకురావటం?

వర్ణాలకలయిక సాధించటంకోసం ఏయే వర్ణాలు కలిస్తే ఆమె శరీరవర్ణం వస్తుందో ఆలోచిస్తూ ఆమెని నఖశిఖపర్యంతం చూడసాగాడు. ఆ శరీరవర్ణానికి రేఖాసౌష్ఠవం మెఱుగులు దిద్దుతోంది. ఆ వంపులన్నీ తన చిత్రంలోకి రావాలి. ఎంతవరకు తను ఆ రేఖల్ని చిత్రంలో పొందుపరచాడో!

పరిశీలనగా చూస్తున్నాడు విశ్వం. ఒక్కసారి సింహావలోకనం చేశాడు వసంత స్వరూపాన్ని నర్తకి భంగిమలో.

వసంత ఇన్నాళ్ళూ ఎంత సౌందర్యం తననించి మరుగుపరిచింది! ఇన్నాళ్ళూ తను చూడని అందాలేవో ఆమెలో ఈరోజు కనిపిస్తున్నాయి.

"అనాఘ్రాతం పుష్పం కిసలయ మలూనం కరరుహైరనావిద్ధం రత్నం..."

ఎవరి అనుభవంకోసం ఈ అందం?

బొమ్మసంగతి మర్చిపోయాడు విశ్వం. వసంత అలాగే నుంచునివుంది. కిటికీలోంచి విసురుగా జల్లు కొట్టింది. ఆ తుంపరలు చల్లగా విశ్వాన్ని పలకరించి పులకింపచేశాయి.

బయట ఉఱుము ఉరిమి మెఱుపు మెరిసింది. మెఱుపులో వసంత...

ఆ సౌందర్యం భరించలేకపోయాడు విశ్వం. తటాలున ఆమెని కౌగిలిలోకి పొదివి పట్టుకున్నాడు. కళ్ళల్లోకి చూసి పెదవులు చుంబించబోయాడు. కాని అకస్మాత్తుగా ఆగిపోయాడు. వసంత విడిపించుకో లేదు. కాని ఆమెముఖంలో ముఖంపెట్టి చూసిన విశ్వానికి ఆమె వదనంలో ఏదో వింతదనం కనిపించింది. అది ఆశ్చర్యమో, భయమో, కోపమో, నిస్సహాయతాభావమో, హేళనో...మరేమిటో, లేక అన్నిటి సమ్మేళనమో విశ్వానికి అంతుపట్టలేదు. తటాలున తన్నుతాను తెలుసుకొని ఆమెని వొదిలేశాడు. తరవాత ఒక్కమాటకూడా అతను మాట్లాడలేదు. ఆమెవైపు చూడటానికికూడా సాహసించలేదు. గబగబ బయటికొచ్చి ఆ గాలివానలోనే ఇంటివైపు నడిచిపోయాడు. వసంత ఏమీ ఆలోచించేస్థితిలో లేదు. అలాగే అతనివైపు చూసింది. మెఱుపు మెరిసింది. కిటికీలోంచి చరచర నడిచిపోతూ విశ్వం కనిపించాడు. అప్పటికి ఆమెకి పరిస్థితి తెలిసింది. ఆమెకి తెలియకుండానే కిటికీదగ్గరగా వెళ్ళింది. ముఖంమీద జల్లు కొడుతోంది. తడుస్తూ వున్నా వెనక్కి రావాలని ఆమెకి తోచలేదు. అలాగే చూస్తూ నిలబడ్డది.

13

ఆ రాత్రంతా విశ్వానికి సరిగా నిద్రపట్టలేదు. కన్నుమూసుకున్నా కన్ను తెరిచినా వసంత కనిపిస్తోంది. తెల్లటి అందాలతో, తెల్లటి కాంతులలో మెరిసిపోయే వసంత! తియ్యతియ్యటి కబుర్లుచెప్పే వసంత! అమాయకంగా మనసులో ఉన్నవన్నీ చెప్పే వసంత! మేకపిల్లలాంటి వసంత! హఠాత్తుగా విశ్వం ఉలిక్కిపడ్డాడు. అప్పుడే మాగన్నుపట్టింది. కల వచ్చింది. మేకపిల్లని తోడేలు తరుముతోంది. పట్టుకునీ పట్టుకునేసరికి కల చెదిరిపోయింది. అంతచలిలో ఆ హోరుగాలిలోకూడా విశ్వానికి ముచ్చెమటలు పోశాయి. తనే తోడేలు! ఎవరినో ఆ మాటతో నిందించాడు. కాని పయోముఖవిషకుంభంలా తయారయాడు తను. వసంత ఏమనుకుంటోం. ఆ ముఖకవళికలు తనెలా మర్చిపోగలడు. ఆ వదనంలో చెదిరిపోయిన గుండె కనిపిస్తోంది తనకి. తొలగిపోయిన విశ్వాసం కనిపిస్తోంది. "నువ్వూ ఇంతేనా?" అని నిస్సహాయంగా కూలబడిపోయినట్టు కనిపిస్తోంది వసంత. తను అది భరించలేదు. ఒక్కక్షణం—మరొక్కక్షణం తన మూఢత్వం తనని విడిచిపెట్టి ఉండకపోతే ఆమెని నాశనం చేసేవాడు. అక్కడికి తను అదృష్టవంతుడే.

అంపెదంపలులేని వసంత తననినమ్మి చనువిస్తే అనర్హతను రుజువు చేసుకున్నాడు కంచే చేనుమేస్తే!.

విశ్వానికి తనమీద అసహ్యం వేసింది. ఒక్క మంచిపనికూడా చెయ్యలేక పోగా ప్రప్రథమంగా ఒక చెడ్డపని చేశాడు! ఆ ఉపన్యాసకుడు ఇప్పుడు తనని నిలదీసి "ఇరవైరెండేండ్ల జీవితంకాలంలో నువ్వు

చేసిన ఒక్క చెడ్డపని చెప్పమంటే తను ఆలోచించుకోనక్కర్లేదు. మంచిపని చెప్పమంటే—అదేపూర్వపు సమాధానమే. వేసిన చోటే గొంగళి.

ఒక్క మంచిపని!.

విశ్వానికి తటాలున ఆలోచనతట్టింది. వసంతని తను పెళ్ళిచేసుకుంటే! ఒక అబలని, దురాచారానికి బలికాకుండా తప్పించుకోవాలని తాపత్రయపడే ఒక కన్నెని ఉదరించినట్లవుతుంది. అంతకంటే ఎవరు మాత్రం చెయ్యగల గొప్ప మంచిపనేముంటుంది? తను వసంతని వివాహం చేసుకుంటాడు.

కాని అది అంతసులభమా? ఎన్ని అడంకులు దాటాలో! ఎన్ని చిక్కులొస్తాయో! అన్నట్టు మావయ్య మళ్ళీవొచ్చి పట్టుబడితే! ఒకవేళ జానకికి తననే చేసుకోవాలని ఉంటే! ఈ పరిస్థితుల్లో తనేం చెయ్యాలి. ఏం చెయ్యగలడు? పైగా ఈ వివాహానికి ఇంట్లో ఒప్పుకోరు. వేరేచోట ఇంట్లోంచి వెళ్ళిపోయి పెళ్ళి చేసుకోవాలి. బహుశా మళ్ళీ ఇంట్లో అడుగు పెట్టనివ్వరు. ఉద్యోగం అయితే పరవాలేదు. కాకపోతే తనెలా ఆమెని పెళ్ళిచేసుకోగలడు!

కాని వసంత అలా సంఘర్షణలో నలిగిపోతుంటే ఎలా ఊరుకోగలడు? తనామెని ఉద్ధరించలేనంత నిస్సహాయుడా? నటేశ్వర్రావులాంటి తోడేళ్ళ బారినించి ఆమె తన్నుతానెలా రక్షించుకుంటుంది, పాపం.

విశ్వానికి ఎటూ తేలలేదు. రాత్రంతా ఆలోచనలతోనే కాలం గడిచింది. తెల్లారేసరికి కళ్ళు ఎర్రబడి ఉన్నాయి. తల దిమ్మెక్కింది. వర్షంలో తడవటంవల్ల ఆరోగ్యంకూడా దెబ్బతింది. ఒంటరిగా ఉన్నప్పుడల్లా రాత్రిజరిగిన సంఘటనే మనసులో మెదుల్తోంది.

విశ్వం ఇలా ఆలోచిస్తుండగా రంగనాథంగారు ఓ ఉత్తరం తెచ్చి అతనికిస్తూ "ఏమిట్రా ఇది?" అనడిగారు. ఉత్తరం మొదటి పంక్తి చూడగానే అతనిపైప్రాణం పైనేపోయింది. అది ఆకాశరామన్న ఉత్తరం. లోకల్ డెలివరిలో వచ్చింది. విశ్వానికి వసంత అనే నాటకాల్లో వేషాలువేసే అమ్మాయితో సంబంధం ఉందనీ, వాళ్ళు పెళ్లి చేసుకోబోతున్నారనీ హెచ్చరించాడు, ఆకాశరామన్న. ఇది నటేశ్వర్రావు పనే అయి ఉంటుందని వెంటనే ఊహించాడు విశ్వం.

"శుద్ధ అబద్ధం" అన్నాడు విశ్వం ధైర్యంగా.

"నువ్వు రోజూ పొద్దున్నే ఎక్కడికి వెళ్ళేది?"

విశ్వానికి నిజంచెప్పాలో అబద్ధం చెప్పాలో తెలియలేదు. ఎందుకైనా మంచిదని నిజమే చెప్పాడు.

"ఆ అమ్మాయి ఇంటికే."

"బొమ్మవేస్తున్నాను. దానికి మోడల్ కావాలి. ఇంటిదగ్గిర బావుండదని అక్కడికి వెళుతున్నాను."

ఈ సమాధానానికి రంగనాథం కొంచెం వెనక్కి తగ్గాడు.

"ఇహనించీ అది మానుకోటం మంచిది. ఏమంటావు?"

"బొమ్మ పూర్తికావొద్దూ?"

"అక్కరేదు."

"అయితే సరే."

"ఒకవేళ నువ్వేమైనా మనసులో ఆ పిల్లని పెళ్ళిచేసుకుందామని అనుకుంటున్నావేమో. అలాంటివి నాకు సరిపడవు. నీదారి నువ్వు చూసుకోవాలిసిందే ఆ పక్షంలో. ఆనర్స్ ప్యాసయినవాడివి. నీ కింతకంటె ఏం చెప్పక్కర్లేదు."

అనేసి ఆయన వెళ్ళిపోయాడు. విశ్వం దీర్ఘంగా నిట్టూర్పు విడిచాడు. తను రాత్రి అనుకున్నాడో లేదో, అప్పుడే విఘ్నాలు మొదలు. ఈ కుళ్ళిపోయిన సంఘంలో ముందడుగు వెయ్యటం సాహసకార్యమే. కాని తను హేతువాదానికి నిలబడాలి. తను చెయ్యగలిగింది తప్పక చేయాలి. వసంతని తను పెళ్ళిచేసుకుని తీరాలి. జీవితంలో అవకాశాలు సులభంగా రావు. వొచ్చిన వాటిని సద్వినియోగం చేసుకోవాలి.

ఆ సాయంత్రం వసంత ఇంటికివెళ్లి తన నిశ్చయం చెప్పాలనుకున్నాడు విశ్వం. కాని ఆమె ముఖం చూడటానికి సాహసం చాలక మానుకున్నాడు. ఉత్తరం రాద్దామని ఆలోచించాడు. కాని ఉత్తరాలు ప్రమాదకరమని రాయలేదు.

ఈ సంఘటన జరిగిన తరవాత విశ్వానికి ఇంట్లో మెసలటం కష్టం అనిపించింది. తనని అదోవిధంగా చూస్తున్నారు. అదికాక తను రెక్కలువచ్చి ఉద్యోగంలో ఇంకా చేరలేదు. తనమీద నిర్లిప్తభావం ఇంట్లోవాళ్ళకి ఏర్పడసాగిందని అతను భావించాడు.

అదృష్టవశాత్తూ తను విజయవాడలో ఒక ఆఫీసులో ఉద్యోగానికి పెట్టిన దరఖాస్తుకి ఫలితం దక్కేలా ఉంది. ఇంటర్ వ్యూకి రమ్మని రాశారు. విశ్వం ఏమీ ఆలోచించకుండా వెంటనే బయల్దేరాడు, పెట్టేబేడా సర్దుకుని. ఉద్యోగం చిన్నదే, అయినా తాత్కాలికంగా చెయ్యవచ్చు ననుకున్నాడు. రంగనాథంగారేమీ అడ్డు చెప్పలేదు. ఈ ఊరినించి వెడితే అమ్మాయి వ్యవహారం కూడా పరిష్కారమైపోతుందని ఆయన భావించాడు. అందువల్ల ఏదో ఓ ఉద్యోగం ఎక్కడ దొరికినా సరే వెళ్లటం మంచిదని ఒక సాధారణ సలహా ఇచ్చాడాయన. విశ్వానికి ఆ సలహా కొంచెం కష్టంగానే ఉంది. తను ఇంట్లో ఊరికే ఉండటంవల్ల అలా తండ్రి అభిప్రాయపడ్డాడని అతనుకున్నాడు.

విశ్వం దరఖాస్తు పెట్టింది ఒక రాజకీయపార్టీ ఆఫీసులో అకౌంటెంట్ పనికి. ఇంటర్ వ్యూలో కార్యదర్శి ఏవేవో ప్రశ్నలడిగి చివరికి విశ్వంవైపు దీక్షగా చూసి అన్నాడు.

"రఘు అనేపేరు బ్రాహ్మలేకదండీ పెట్టుకునేది?" ఆ ప్రశ్నలోని భావం వెంటనే విశ్వానికి అర్థంకాలేదు.

"ఈ రోజుల్లో అందరికీ అది మామూలుగా ఉండేపేరే గదండి" అన్నాడు.

కార్యదర్శి విశ్వంవైపు చూస్తూ ఏదో అడగటానికి సంకోచిస్తున్నాడు.

"మీరు...?" అంతవరకే ఆయన అడిగాడు, విశ్వం సమాధానంకోసం ఎదురుచూస్తూ.

అర్థమైంది విశ్వానికి. అతనిముఖంలో అసహ్యం తాండవించింది. ఈ మనిషికి రెండుముఖాలు. గట్టిగా అడిగే ధైర్యం ఆయనకి లేదు. కులతత్వాలకి అతీతులవాలి ప్రజలు. అడక్కుండా ఉండలేడు. తన కులంకాకపోతే ఉద్యోగం ఇవ్వడు. అంతవరకు ఖాయం. "మంచిచెడ్డలు రెండేసులాలు అన్నాడు కదూ కవి! మరి నామంచినిగురించి నేను చెప్పకోకూడదు." అన్నాడు నవ్వుతూ. కార్యదర్శి ముఖం చిట్లించుకున్నాడు. అలా చిట్లించుకుంటాడని విశ్వానికి తెలుసు. ఆయనకి వచ్చే సమాధానం తినదగిరుంటే సూటిగా చెప్పేసేవాడేనని కార్యదర్శి ఊహ! అలాంటి ఆఫీసులో ఉద్యోగంఇచ్చినా తిన కక్కర్లేదు. అయిష్టత పైకి కనపడనివ్వకుండా ఏవో ఒకటిరెండు విషయాలు మాట్లాడి ఇంటర్వ్యూ ముగిస్తూ "వెళ్లిరండి" అన్నాడు కార్యదర్శి.

"ఫలితం ఎప్పుడు తెలియచేస్తారు?"

"పోస్టులో తరవాత పంపిస్తాం- సెలెక్టయితే."

వెళ్లాడు విశ్వం. ఆ తరవాత కుతూహలంకొద్దీ ఆఫీసులో విచారిస్తే ఆ ఖాళీ భర్తీఅయిందని తెలిసింది. కొత్త ఉద్యోగి కార్యదర్శిగారి స్వకులస్థుడేట! బి.ఏ. తప్పాడట!

విశ్వం ఓగది అద్దెకు తీసుకుని ప్రతిఆఫీసు తిరగసాగాడు. ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజిలో పేరు నమోదు చేయించుకున్నాడు. కనీసం లోవర్ డివిజన్ గుమాస్తా అయినాసరేనని ఆఫీసర్ గారితో చెప్పాడు. ఒక ఆఫీసులో ఉద్యోగం వచ్చినట్టే వచ్చి పోయింది. పొద్దునవచ్చి పనిలోచేరమని అధికారంగా చెప్పాడు మేనేజర్. ఇంటికి ఉత్తరంకూడా రాసేశాడు ఉద్యోగం వచ్చిందని. కాని ఉదయం ఆఫీసుకి వెళ్లేసరికి మేనేజర్ తన విచారం తెలియచేశాడు. కొన్ని పరిస్థితులవల్ల ఆ ఉద్యోగం మరొకరికి అకస్మాత్తుగా ఇవ్వాలిసొచ్చిందని చెప్పాడు. కాళ్ళీడ్చుకుంటూ నిరాశతో వెళ్ళిపోయాడు విశ్వం.

ఇంటినుంచి తెచ్చిన డబ్బు అయిపోవచ్చింది. ఉద్యోగంవచ్చే ఆశ ఏమీ లేదు. తిరిగి ఇంటికి వెనక్కి వెళ్ళటానికి అతని అభిమానం అడ్డొచ్చింది. ఏ ఉద్యోగమైనా సరే చేరటం మంచిదట! పొట్టగడిచేది ఏదైనా సరే తను చేరదలచుకున్నాడు. కాని ఆశలన్నీ అడియాసలౌతున్నాయి. కాఫీ మానేశాడు. టిఫిన్ మానేశాడు. భోజనంలో పెరుగు మానేశాడు. తరవాత ఒకపూట భోజనం మానేశాడు. ఏదో ఒక టిఫిన్ భోజనం బదులు తీసుకునేవాడు. తరవాత రెండుపూటలు అలాగే చేశాడు.

అర్థాకలివల్లా, నిరాశవల్లా పట్టుదల సడలజొచ్చింది. కాని అభిమానం ముంచుకొస్తోంది. ఏ ఉద్యోగమైనా సరే! ఆనర్స్ ప్యాసైనట్టు ప్రొవిజనల్ సర్టిఫికేట్టు చేతిలో ఉంది. కనీసం తిండిపెట్టే స్తోమతు దానికి లేదా?

డబ్బు తగ్గిపోతున్నకొద్దీ దాని విలువ మరింత ఎక్కువైపోతోంది. ఒకపూటే టిఫిన్ తీసుకోసాగాడు.

భోజనం మొదలే లేదు. చివరికి ఆలోచించి అతి చౌక విధానం కనిపెట్టేశాడు బతకటానికి. అరటి పళ్లు!

"ఫరవాలేదు. అరటిపళ్లు బాగానే ఉంటాయే" అనిపించింది విశ్వానికి. చాలారోజుల తరవాత మొదటి సారిగా రుచిచూశాడు. తనకి అవి సహించేవికావు పూర్వం. చక్కెరకేళీ అయితేనే తినేవాడు.

ఉన్నడబ్బయిపోయింతరవాత ఏం చేయాలో విశ్వానికి తోచలేదు. తక్కువ పనులు చెయ్యటానికి అతనికి మనస్కరించటంలేదు. రిక్షా లాగి కూలీ చేసుకొనీ బొక్కపోతే ఏం? కాని— 'జీవన్ భద్రాణి పశ్యతి!' జీవించటానికేదో పనిచెయ్యాలి. అందులో గౌరవహాని ఏంలేదు. కాని తనచదువు వృథా! అయినా పనిచెయ్యటానికి తను సిద్ధమే. కాని పని ఎవరిస్తారు? ఒకసారి బట్టల షాపులో తను కసురుకున్న వ్యక్తి కళ్లలో మెదిలాడు. అతని రూపానికీ తన రూపానికీ ఇప్పుడంత తేడా ఏంలేదు. గడ్డంచేసి ఎన్నాళ్లో అయింది. బేడా పెట్టి చేసుకొనటమే! ఎనిమిది అరటిపళ్లొస్తాయి.

తనుమాత్రం చచ్చినా బిచ్చమెత్తడు. అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అడుక్కునే వాళ్లని సానుభూతితో చూశాడు. అభిమానం చంపుకుంటున్నారు, పాపం.

తను ఎన్నో పనులు చెయ్యదలచుకున్నాడు. కాని తనజీవితం ఇలాగే అంతమవుతుందేమో! ఇప్పుడు ఈ స్థితిలో వసంత తనని చూస్తే! ఏం చేస్తుందో! కన్నీటితో అభిషేకం చేస్తుందేమో!

తనని చూసి తను జాలిపడుతున్నాడు. అకస్మాత్తుగా ఈవిషయం గ్రహించాడు విశ్వం. ఇతరుల బాధలు చూసి జాలిపడటం మంచిగుణం. కాని తన మీద జాలి ఘోరం! మరుక్షణంలో విశ్వం ముఖంలో గాంభీర్యం వచ్చింది.

సంజకాంతులు విరజిమ్ముతోంది సూర్యబింబం. మర్నాడు తను ఏదో ఒకపనిలో చేరతాడు. అది ఏదైనా సరే. దృఢనిశ్చయం అతని కళ్లలో మెరిసింది. ఏపనిచేసినా ఇక తనమీద తను జాలిపడడు. అనంత విశ్వంలో తనూ ఒకడు. తన బతుకుకోసం ఏదోవిధంగా ప్రయత్నించటం తన విధి. 'ఇన్నాళ్లూ తనేదో లేనిపోని గౌరవం తనకి ఆపాదించుకొన్నాడు తను చదువుకున్నవాడు కావొచ్చు. అయితే చదువు పనికొచ్చే పరిస్థితి లేనప్పుడు తను విచారించాల్సిన అవసరమేమీ లేదు. తను కొంతవిజ్ఞానం సంపాదించుకున్నాడు. అది విజ్ఞానంకోసం. అంతే. అది ధనార్జనకి పనికిరాలేదని తనకి ఇంత కాలంకోపంగా ఉంది. వెర్రివాడు తను! పరిస్థితులు తనెవరో గురుచేస్తున్నా కూడా గుడ్డివాడై గమనించలేక కాలం వృథాచేశాడు!

విశ్వం అరటిపళ్లదుకాణంవైపు నడిచాడు. నాలుగు అరటిపళ్లుకొని తిరుగుముఖం పట్టాడు. కుళాయి కనిపిస్తే మంచినీళ్లు తాగాడు. రెండడుగులు వెయ్యగానే అకస్మాత్తుగా నీరసం ఆవహించింది. ఎన్నాళ్లనించో అరటిపళ్ల మీద బతుకుతున్నాడు. అవి కడుపునిండా తను తినలేడు. తిన్నా సరిపడదు. కాసేపు కూర్చుని మళ్లీ రెండడుగులు వేశాడు. కళ్లు గిర్రున తిరిగాయి. ఎదురుగుండా రిక్షా వస్తోంది. పక్కకి తప్పుకుంటూ తూలిపడిపోయాడు. రిక్షాలో కూర్చునివస్తున్న స్త్రీ ఆదృశ్యం చూసింది. రిక్షా ఆగింది. రిక్షావాలా విశ్వం ముఖం మీద నీళ్లు జల్లాడు. విశ్వం తెప్పరిల్లి కళ్లు తెరిచాడు. "ఎవరో ముషివాడు కాబోలు పాపం. ఎన్నాళ్లనించి తిండి లేదో. ఇదిగో ఈ రూపాయి అతనిచేతిలో పెట్టు" రూపాయి నోటు రిక్షావాలాకి అందించిందామె. అతనది విశ్వానికివ్వబోయాడు.

"నేను అడుక్కునే వాడిని కాదు!" విషాదంగా హీనస్వరంతో అన్నాడు విశ్వం.

"మీ రెవరు? ఇలా పడిపోయారేం?" అందామె అనునయంగా, తను చేసిన పొరపాటుకి చింతిస్తూ.

"నేను ఆనర్స్ గ్రాడ్యుయేటుని, కవిని. చిత్రకారుణ్ణి..." అంటూ ఆమె ముఖంలోకి చూశాడు విశ్వం. ఆతని ముఖం వివర్ణమైంది. అత్యాశ్చర్యంతో "జానకీ" అన్నాడు. ఆ పిలుపుకి జానకి అప్రతిభురాలైంది. పరకాయించి చూసింది విశ్వాన్ని. సంభ్రమాశ్చర్యాలతో దగ్గిరికొచ్చింది.

"నువ్వేనా బావా! ఏమిటిదంతా?" ఆమెకంఠం గద్గదికమైంది.

విశ్వం ఏమీ అనలేదు. నెమ్మదిగా లేచి నుంచున్నాడు. కింద అరటిపళ్ళు పడివున్నాయి. వొంగి తీసుకోవాలని ప్రయత్నించి ఓపిక లేక మానేశాడు.

"మాట్లాడవేం బావా?" అంది జానకి అతనివైపు జాలిగా చూస్తూ.

"పరిస్థితుల ప్రభావంలే" అన్నాడతను.

"పోదాం పద."

"ఎక్కడికి?"

"ఇంటికి."

"ఇల్లా?"

"అవును రెండు రోజుల్నించీ ఇక్కడ ఉంటున్నాం. తరవాత చెబుతాలే. పద."

"తర్వాత వొస్తాలే"

"నిన్నిలా వొదిలివెడతాననా నీఅభిప్రాయం?"

"నాకు రూమ్ వుంది."

"ఉంటే ఉందిలే."

విశ్వం కాసేపు తటపటాయించి "సరే పద" అని రెండడుగులు వేశాడు రిక్షావైపు. అతని కాళ్ళు తేలిపోయాయి.

"నిస్సత్తువగా ఉంది జానకీ" అంటూ వెనక్కి తిరిగాడు, అరటిపళ్లకోసం.

అరటిపళ్లు ఒక వరాహం కబళిస్తోంది.

"అయ్యో!" అన్నాడు విశ్వం అప్రయత్నంగా.

"ఏమిటి బావా?" అని వెనక్కి తిరిగి చూసింది జానకి.

"తినటానికేమైనా ఉంటే బాగుండును!" హీన స్వరంతో అరటిపళ్లవైపు చూస్తూ అన్నాడు విశ్వం.

తన గుండె ఎవరో గట్టిగా గుప్పిటలో బిగించినట్టయింది జానకికి.

రిక్షావాడికి డబ్బిచ్చి చక్కరకేళీపళ్ళు తొందరగా పట్టుకురమ్మని చెప్పింది.

"ఎందుకూ, సాదావి చాలు. ఇదిగో, నాదగ్గిర ఒక అణా ఉంది." జేబులో చెయ్యిపెట్టి అణా తీసి రిక్షావాడివైపు చూశాడు. వాడంతకిముందే వెళ్ళిపోయాడు.

విశ్వం చేతిలోఅణాఅలాగే పట్టుకునిశూన్యంగా జానకివైపు చూశాడు.

"అణా ఉందా బావా?"

"ఉంది జానకీ, ఇదిగో" అమాయకంగా చూపించాడు విశ్వం.

జానకి కళ్ళలో నీళ్లు గిర్రున తిరిగి నేలమీదికి టపటప జారాయి.

అణా ఉందట.

ఆఖరి అణా.

సాదా అరటిపళ్ళకోసం.

"అరటిపండు మాత్రం ఇవ్వరు జానకీ. నాకు చక్కరకేళీ తప్ప సాదావి ఇష్టం లేదు" అన్నాడు విశ్వంబావ ఒకసారి.

"సాదావి చాలు జానకీ" అంటున్నాడీరోజు.

ఆ దైన్యం భరించలేకపోయిందామె. దుఃఖం ఆమెలో పొంగిపొర్లింది. సంజకాంతుల్లో మెరుస్తూ ఆమె కనుకొలకులలోంచి కన్నీటి బిందువులు నేలకి జారుతుంటే తదేకదృష్టితో ఆ దృశ్యం చూస్తూ నిలబడిపోయాడు విశ్వం.

14

గవర్నమెంటు జనరల్ ఆస్పత్రిలో స్పెషల్ వార్డులో పడుకుని ఉన్నాడు సూరి. తలకి కట్టు కట్టి ఉంది. అతని మంచం పక్కనే ఒక స్టూల్ మీద కూర్చున్నాడు విశ్వం. జానకి సూరి తలవైపు కూర్చుని ఉంది.

"ఏమిట్రా ఈ ఉపద్రవం?" అడిగాడు విశ్వం.

"జానకి చెప్పలేదా?"

"చెప్పిందిలే. కాని నువ్విప్పుడు చెప్పగలిగే స్థితిలో ఉన్నావుగా. ఏం జరిగిందో చెప్పు. ఫస్ట్ హాండ్ ఇన్‌ఫర్మేషన్ కావాలి."

"ఏముంది, మామూలు గొడవలే."

నువ్వు జోక్యం కలిగించుకునేవాడివి కావుగా"

"ఈసారి కలిగించుకున్నాను."

"ఎందువల?"

"ఏం చేస్తాం? ఊరు మొత్తం కోర్టు కెక్కేట్టుంటే!"

"ఏం జరిగిందేమిటి?"

"పంచాయితీ ఎన్నికలు జరుగుతున్నాయి కదూ. ప్రెసిడెంటు పదవికి ఇద్దరు పోటీచేయదలచుకున్నారు మా ఊళ్లో. ఇంకేం తగాదాలు, కొట్లాటలు మొదలు".

"నువ్వే పార్టీ?"

"నాకు పార్టీ ఏమిటి?"

"మరి దెబ్బలెందుకు తగిలాయి?"

"చెప్పేది విను. మునసబుగారబ్బాయీ, నేనూ స్నేహితులం. నేను సామాన్యంగా పేచీ వ్యవహా

రాల్లో కల్పించుకోను. కాని అతని పరిస్థితులు మరీ విషమించేట్టున్నాయి. ఏదో చెయ్యాలని నడుం కట్టాడు. చూస్తూ ఎలా ఊరుకోను? ఒంటరిగాడేం చేస్తాడు! ఇద్దరం కలిసి ఒక అభ్యర్థిని పోటీనించి విరమింపచేయాలని ప్రయత్నించాం. ఇద్దరికి మా మీద అనుమానం ఏర్పడ్డది. మే మేదో మూడో పార్టీ పెట్టి ఊరు మావైపు తిప్పుకోవాలని చూస్తున్నామని వాళ్లూహించారు."

"మన విదేశాంగ విధానంలా ఉంది నీకథ"

"చివర మారిందిలే. విను మరి. మూడో పోటీదారు వచ్చాడనుకునే సరికి వాళ్లిద్దరూ ఏకమయ్యారు. ఇదరూ కలిసి ఏదో సంప్రదించుకున్నారు. పోటీ తప్పిపోయింది. కక్షలు తగిపోయాయి. అంటే నా ప్రయత్నం సఫలమైందన్నమాట. నాకేదో సన్మానం జరుగుతుందని తెలుసులే."

"శుభం. కాని దెబ్బల సంగతేమిటయ్యా మహాప్రభూ?"

"అదే సన్మానం. కావాలని రెచ్చగొట్టానులే. అయితే ఇంత పని జరుగుతుందని అనుకోలేదు. ఏదో కొద్దిలో పోనిస్తారనుకున్నాను."

"నువ్వు చెప్పేది నాకేమీ అర్థం కావటం లేదు."

"అర్థంకానిదేముందీ? పోనీ ఇంకొంచెం విపులంగా చెబుతాను. వాళ్ళు పోటీ విరమించుకోమని మంచిగా చెబితే వినలేదు. వినరని ముందే తెలుసులే. అందుకని ఈ మూడోపక్షం గురించి పుకార్లు లేవదీశాను. అక్కడా అక్కడా వాళ్లని గురించి నే నేదో అన్నట్టు కల్పించాను. దాంతో వాళ్లకి ఉక్రోషాలు పెరిగాయి. ఏమయితే ఏం? ఊళ్లో పేచీలు తప్పిపోయాయి ప్రస్తుతానికి."

విశ్వం సూరివైపు ఆశ్చర్యంగా చూశాడు.

"అయితే సాహసించి కావాలని అభాండాలు నెత్తిన వేసుకున్నావా?"

"మరి ఏంచెయ్యను? లేకపోతే ఆ ఊళ్లో బతకటం మరీ కష్టం. నీకు తెలుసుగా. గలాటాలంటే నాకు చెడ్డ తలనొప్పి."

"నిన్ను కొట్టినవాళ్ళెవరు?"

"ఎవరయితే ఏంలే..."

"అదేమిటి? క్రిమినల్ కేసు పెట్టి జైల్లో పడేయించి వాడి పాట్లు వాడికి కరపకుండా ఉంటావూ?"

"నీకు తెలియదులే బావా ఈ గొడవంతా, ఆ కోర్టు గొడవలు లేకుండా చెయ్యటానికికదూ ఇంత శ్రమా పడ్డది."

విశ్వం సూరివైపు అర్థం కానట్టుగా చూశాడు.

"అయితే వాడిని వొదిలేసావా?"

"లేకపోతే వాడిమీద నాకు కక్షేమిటి? వెధవ ఎదురుగావస్తే ఎడంచేత్తో కాలువ కట్టమీదికి విసిరెయ్యగలను. బుద్ది తక్కువపని చేశానని లబోదిబోమంటూ ఉంటాడీపాటికి."

"నీది గాంధీగారి పద్ధతిలా ఉంది."

"నాదేపదతీ కాదు. అది నా స్వభావం. అంతే."

"సుజనపద్ధతి అంటాలే."

"అదిగో, అదే నాకు సరిపడదు. నేను వాళ్లకోసమో, వీళ్లకోసమో ఏదీ చెయ్యలేదంటే నమ్మరేం? నాకో ఊరుంది. ఆ ఊళ్ళో నేను జీవితం గడపాలంటే అందుకు తగిన వాతావరణం సాధ్యమైనంతవరకూ కల్పించుకోవాలి. దీనికేమిటో పేర్లు పెడతారేం?... ఇంతా చేస్తే, ఈ మూడోపక్షం సంగతి ఆ మునసబుగారబ్బాయి టపాకాయలా పేల్చేస్తాడేమోనని భయంగా ఉంది. ఎరక్కపోయి అతనికి చెప్పాను. ఊళ్లో అప్పుడే నే నేదో తంత్రం పన్నానని గుసగుసలుగా ఉందిట. వాన్న చెప్పాడు. అసలూ ఈ మనుషులకి పొగడ్తలంటే మహా ఇష్టం."

గబగబ మాట్లాడటంతో సూరికి కొంచెం ఆయాసం వొచ్చింది. జానకి అతనిని మాట్లాడవద్దని హెచ్చరించింది.

విశ్వం సూరివైపు ప్రశంసా పాత్రంగా చూడసాగాడు. ఏదో పొగడ్తగా అన బోయినవాడల్లా సూరి అన్న చివరిమాటలు విని నోరెత్తకుండా ఊరుకున్నాడు. సూరిని తను చిన్నప్పటినించీ ఎరుగు. వాడింత ఘటికుడని తను అనుకోలేదు, తను వాడినించి నేర్చుకోవాలిసింది చాలా ఉంది!

మరి కాసేపటికి వెంకట్రామయ్యగారు వచ్చి "మీరిద్దరూ వెళ్ళిభోజనం చేసిరండి. నేను మీరొచ్చేదాకా సూరి దగ్గర ఉంటాను" అన్నారు.

జానకీ, విశ్వం ఆస్పత్రి బయటికొచ్చారు. మార్గంలో జానకి సూరినిగూర్చి వెంకటపతి వృత్తాంతం తంతోసహా అంతా చెప్పింది. విశ్వానికి అదంతా చాలా కొత్తిగా ఉంది సూరి ప్రవర్తననిజంగా అపూర్వం అనిపించిందతనికి. తను సూరిని పైచదువుకి వెళ్లమని ప్రోత్సహించాడు, వెడితే సూరి బాగుపడేవాడే వ్యక్తిగత అభ్యున్నతి దృష్ట్యా. కాని ఊరు పాతకాలంలో లాగే ఉండేది.

భోజనంచేసి పడక కుర్చీలో పడుకున్నాడు విశ్వం. అతని మనసులో ఏవేవో ఆలోచనలు కదిలాయి. జానకి చాపమీద కూర్చుని ఏదో పనిచేసుకుంటోంది.

ఆమెవైపు యథాలాపంగా చూశాడు విశ్వం. ఆమె వదనంలో ప్రశాంతత తాండవిస్తోంది. తనని దౌర్భాగ్యస్థితిలో చూసినప్పుడు ఆమె ముఖంలో ఎంత ఆవేదన ప్రస్ఫుటమైంది! పొంగి పొర్లే దుఃఖాన్ని ఆమె బలవంతాన ఆపుకుంటుంటే ఆ దుఃఖమంతా కన్నీరై నేలమీదికి జారే దృశ్యం అతని మనో వీధిలో మెరిసింది. అది విపరీత పరిస్థితే కావచ్చు; కాని తను కష్టంలో ఉంటే అంతగా ఆమె బాధపడాలిసిన అగత్యమేమిటి?

అకస్మాత్తుగా విశ్వం భావవీధిలో ఏదో వెలుగు గోచరించింది. జానకి తనని ప్రేమిస్తోందా? ఎలా ఈ విషయం తెలుసుకోవటం. ఒక వేళ ఆమె తనని ప్రేమిస్తే జీవితంలో ఒక గొప్పసమస్య తను ఎదుర్కోవాలి. పరిస్థితులు ప్రశుతిమించకముందే నిజం తెలుసుకుని సమయోచితంగా ప్రవర్తించాలి. సరాసరి ఈ ప్రశ్న జానకిని అడిగితే? ఆమె ఏమనుకుంటుందో! ఇప్పటికే ఒకసారి ఒకవ్యక్తి ఇచ్చిన చనువుదుర్వినియోగం చేసుకున్నాడు. డొంక తిరుగుడుగా ఆమెచేత విషయం బయటపెట్టించాలి.

"జానకీ. "

"ఏమిటి బావా?"

"వ్యక్తిలో ఎటువంటిగుణాలు నీకిష్టం?"

"మంచి గుణాలు." ఇదికూడా ఓ ప్రశ్నేనా అన్నట్టుగా జానకి సమాధానం చెప్పింది.

"చెడ్డగుణాలుగల మనిషైతే?"

"బాధగా ఉంటుంది."

"అది సరే. అతనిపట్ల నీ ప్రవర్తన ఎలా ఉంటుంది?"

"ఇప్పుడెందుకా సంగతి?"

"కావాలి."

"ఆ సందర్భంలో కాని తెలియదు."

"నేను తాగుడు అలవాటుచేసుకుంటాననుకో."

"నాలుగు చివాట్లు పెడతాను."

"అంతేగాని ఇంకేం చెయ్యవా?"

"వీలైతే బాగుచెయ్యటానికి ప్రయత్నిస్తాను."

"లేకపోతే?"

"ఒక దణ్ణంపెట్టి ఊరుకుంటాను."

"అంతేగాని అసహ్యించుకోవా?"

"గుణాల్నిగాని మనుషుల్ని అసహ్యించుకోటం ఎందుకూ?"

"నీకాబోయే భర్తే అలా చేస్తాడనుకో."

"చాల్లెద్దూ, వేళాకోళం." అంది జానకి చిరుకోపంతో విసుగ్గా.

"కాదు జానకీ చెప్పు."

"అప్పుడేంచేస్తానో వొచ్చి చూద్దువుగానిలే."

ఆమెవంక పరిశీలనగా చూశాడు విశ్వం.

"రానిస్తావా?"

"పరాయివాడివైనట్టు మాట్లాడతావేం?"

"రానిచ్చినా ఇటువంటి సంగతులు చెబుతావేమిటిలే," ఆమెవంక దొంగతనంగా చూస్తూ అన్నాడతను. జానకి ఏమీ మాట్లాడలేదు.

"ఊరికే అన్నాలే జానకీ, నీకు మంచి మొగుణ్ణే వెతికి పట్టుకొస్తాంగా."

"పనీపాటా లేకపోతేసరి." అనేసి జానకి లేచి వెళ్ళబోయింది.

"వెళ్లకు, వెళ్ళకు, నీకు పుణ్యముంటుంది, ఒక్క సలహా ఇవ్వు జానకీ."

"నాకు సలహాలివ్వటం రాదు."

"వొచ్చులే. చూడు, మనిషి ఏదైనా ఒక మంచి పని చెయ్యాలని నీకనిపించదూ?"

"ఒకటేమిటి, చాలా చెయ్యాలి."

"కనీసం ఒక్కటి. కొంచెం ఆలోచించి చెప్పు. నేనేంచేస్తే బావుంటుందంటావు?"

"నీ ఇష్టంవచ్చింది చెయ్యి. నాకేం తెలుస్తుంది".

"నూరిలా నాక్కూడా ఏదైనా మంచిపని చెయ్యాలని ఉంది."

"అన్నయ్య అలా చేశానని ఎప్పుడూ చెప్పలేదే"

"అహఁ. ఆ కాదు. సంఘాన్ని ఉద్ధరించేపని చేస్తే బావుండదూ?"

"నువ్వూ నేనూ ఒకర్ని ఉద్ధరించేదేమిటి లే బావా."

"అలా తీసివెయ్యకుమరి. పెళ్ళి విషయమే తీసుకో. కట్నం లేకుండా పెళ్ళిచేసుకోటమో, వర్ణాంతరం చేసుకోవటమో......"

"రెండో పెళ్ళి చేసుకోకుండా ఉండటమో..." జానకి నవ్వుతూ అంది.

"హాస్యంకాదు. సాంఘికదురాచారానికి బలి కాబోయే స్త్రీని పెళ్ళిచేసుకుంటే?"

"చేసుకో, మంచిదే." నిర్లిప్తంగా అందిజానకి.

విశ్వం ఆమె ముఖంలోకి చూశాడు. ఆమెలోని ఏభావమూ ముఖంలో ప్రతిఫలించటం లేదు.

"జాగ్రత్తగా ఆలోచించి చెప్పు. వేళాకోళానికి అడగటం లేదు."

జానకి కొంచెం ఆలోచించింది.

"ధైర్యం ఉంటే, మనసారా కోరితే చేసుకోటం మంచిదే బావా. ఇందులో సలహా చెప్పటానికేముంది? అది కేవలం వ్యక్తిగత విషయం కదా?"

అంత తేలిగ్గా, ఏ భావమూ లేకుండా ఆమె అభిప్రాయం వెలిబుచ్చుతుందనుకోలేదు విశ్వం. కాని ఆ సమాధానం అతనికి తృప్తినిచ్చింది. ఒక గడ్డు సమస్య ఎదుర్కోవలసిన అవసరం తప్పింది.

"నువ్వంటే నాకెంతో అభిమానం జానకీ."

"చెప్పాలా ఏమిటి?" అంది నెమ్మదిగా జానకి.

"నీకు మంచి సంబంధం రావాలనీ, మూడు పువ్వూలూ ఆరు కాయలుగా, నిత్యకల్యాణం పచ్చతోరణంగా నువ్వు సంసార జీవితం గడపాలనీ నా కోరిక."

"నువ్వు మంచివాడివి బావా." అందామె.

"నేనంటే నీకు అభిమానమే కదు జానకీ?"

ఆమెలో ఏ జ్ఞాపకాలు మెదిలాయో, కళ్లు చెమ్మగిల్లాయి. ఆ నీళ్ళు నిండిన కళ్లతోనే విశ్వం వైపు ఒకసారి చూసింది. విశ్వం హృదయం ఆర్ద్రమైంది

"ఏమిటి బావా, చాదస్తం? నువ్వంటే నాకభిమానం ఉండదూ?"

"ఎందుకుండాలి?" కావాలని తర్కించాడు విశ్వం.

"బావవి కనుక. మంచివాడివి కనుక. ఇంకా-నేనంటే నీకభిమానం కనుక."

అంతేనా?"

"మరింకేముంటాయి కారణాలు? అయినా ఇవన్నీ నేనెప్పుడూ ఆలోచించలేదు. ఆలోచించను కూడా. తిరిగ్గా కూచుని భలే ప్రశ్నలడుగుతున్నావులే. రేపు పెళ్ళయితే మా అక్కయ్యని కూడా ఇలాగే అడుగుతావు కాబోలు." అని కలకల నవ్వుతూ జానకి అతనివైపు చూసింది.

ఆ నవ్వులో నిర్మలగంగాప్రవాహపు గలగలా, ఆ చూపులో ఆత్మీయత, స్నేహగౌరవాదరాభిమానాలూ దర్శించి పరవశించాడు విశ్వం. స్త్రీపురుష భేదానికి ప్రాముఖ్యం లేని ఏదో పవిత్రమైన ఆత్మీయత తమ హృదయాలని ఆవరించినట్టు అతను ఆ క్షణాన అనుభూతిపొందాడు.

సశేషం